క్లుప్తంగా

నేడు ఎంపీ పర్యటన

మదనపల్లె : వైఎస్సార్ సీపీ లోక్‌సభపక్షనేత, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఎమ్మెల్యే నవాజ్‌బాషాతో కలిసి బుధవారం పట్టణంలో పర్యటిస్తారని ఎంపీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 11గంటలకు బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శిస్తారని, తర్వాత 12.30 గంటలకు హజ్‌యాత్రకు వెళ్లే యాత్రికులకు ఈద్గా మైదానంలో టీకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. మదనపల్లె నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

3 నుంచి గుండ్లూరు మూలస్థానమ్మ తిరునాల

కలికిరి: మండలంలోని గుండ్లూరులో వెలసిన శ్రీదేశాయి మూలస్థానమ్మ వార్షిక ఉత్సవాలలో భాగంగా జూన్ 3 నుంచి 5వ తేదీ వరకు మూడు రోజుల పాటు తిరునాల నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. తిరునాల ఉత్సవాలలో శనివారం సిద్ధపూజ, జాగారం, బయనేని వారిచే మూలస్థానమ్మ హరికథ, ఆదివారం అమ్మవారికి శిల్లు, బోనాలు సమర్పణ, చాందినీ బండ్లు ఊరేగింపు, సోమవారం రాత్రి అమ్మవారు పుష్పపల్లకీలో గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నేటి నుంచి వేరుశనగ విత్తనాలు పంపిణీ

వాల్మీకిపురం: మండలంలో బుధవారం నుంచి వేరుశనగ విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయ అధికారి హేమలత తెలిపారు. మండలానికి వేరుశనగ విత్తనాలు 1639 క్వింటాళ్ల కేటాయించారని తెలిపారు. విత్తన ధర కె6 రకం 30కిలోలు రూ.1674 , నారాయణి రకం రూ.1773 నిర్ణయించారని తెలిపారు. రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డ్, మొబైల్ ఫోన్ తమ వెంట తెచ్చుకొని ఆర్‌బీకే అధికారులను సంప్రదించాలని ఆమె కోరారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కురబలకోట: మండలంలోని తెట్టు అటవీ ప్రాంతంలో మంగళవారం రూ. లక్ష విలువ చేసే కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఆరుగురిని అరెస్టు చేసినట్లు మదనపల్లె ఎస్ఈబీ ఇన్‌చార్జి సీఐ పి. శ్రీహరి రెడ్డి తెలిపారు. అరెస్టు చేసిన వారిలో తెట్టుకు చెందిన రెడ్డెప్ప, హరీష్, రమేష్‌బాబు, రెడ్డిశేఖర్, చంద్రాయప్పతో పాటు కర్ణాటక రాష్ట్రం ముదిమడుగుకు చెందిన కదిరి రెడ్డి ఉన్నట్లు తెలిపారు. ఏడు బాక్సుల డబుల్ కిక్ విస్కీ రకానికి చెందిన మద్యంతో పాటు రెండు ద్విచక్ర వాహనాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

90 మద్యం ప్యాకెట్ల పట్టివేత

పెద్దతిప్పసముద్రం: మండలంలోని తుమ్మరకుంట పంచాయతీ కాప్పల్లి క్రాస్ వద్ద ఎస్ఐ రవీంద్రబాబు మంగళవారం సిబ్బందితో కలసి నాకాబందీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో బూర్లపల్లి హరిజనవాడకు చెందిన చిన్నగూటం నరేష్ కర్ణాటక రాష్ట్రం నుంచి ప్లాస్టిక్ సంచితో వస్తుండగా అనుమానంతో పోలీసులు తనిఖీ చేశారు. 90 ప్యాకెట్ల అక్రమ మద్యం సంచిలో ఉన్నట్లు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 38 మంది ఎంపిక

మదనపల్లె సిటీ: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో మంగళవారం జేకేసీ ఆధ్వర్యంలో టీసీఎల్ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 38 మంది ఎంపికైనట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి తెలిపారు. వివిధ ప్రాంతాలకు వచ్చిన వారిని ఇంటర్వ్యూలను నిర్వహించారు. కార్యక్రమంలో జేకేసీ సమన్వయకర్త నమ్రత, అధ్యాపకులు విష్ణుప్రియ, వనజ,మోహన్‌బాబు,జ్యోతి, శ్రీనివాసులు, ఖాజావల్లి తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి ఇంటర్ ప్రత్యేక పరీక్షలు

వాల్మీకిపురం: జూన్ 2వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని స్థానిక పీవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఉమా అమరేశ్వరి అన్నారు. ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి జూన్ 2న ఉదయం 10 గంటలకు నైతిక, మానవ విలువలు అంశంపై, 3న పర్యావరణ విద్యపై ప్రత్యేక పరీక్షలు ఉంటాయన్నారు. ఈ పరీక్షలు మొదటి సంవత్సరం విద్యార్థులకు తప్పనిసరి అన్నారు. ఎవరైనా మొదటి సంవత్సరం విద్యార్థులు ఏప్రిల్‌లో ఈ ప్రత్యేక పరీక్షలు రాయని వారు ప్రస్తుతం తప్పక హాజరై రాయాలన్నారు.

దిశ, మహిళా చట్టాలపై అవగాహన

కలకడ : విద్యార్థినులు, మహిళలకు దిశ, మహిళా చట్టాలపై అవగాహన కల్పించాలని సీఐ నాగేంద్ర అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సచివాలయ మహిళ పోలీసులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాల నివారణ, మహిళలకు ప్రభుత్వం, పోలీసులు కల్పిస్తున్న భద్రతను తెలియజేయాలన్నారు. అసాంఘిక కార్యక్రమాల నివారణ, గ్రామాలలో జరుగుతున్న మద్యం అక్రమ రవాణ, సారా తయారీ, విక్రయాలపై తక్షణ సమాచారం అందించాలని ఆదేశించారు. కోడిపందేలు, పేకాట స్థావరాలను గుర్తించి నివారణకు ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సిటి స్వామి, పోలీసులు పాల్గొన్నారు.

పెరిగిన టమాటా ధరలు

- మార్కెట్‌లో కిలో రూ.34
- ఈ ఏడాది సీజన్‌లో ఇదే అత్యధికం
- బయటప్రాంతాల్లో పెరుగుతున్న డిమాండ్
- దిగుబడులు తక్కువగా రావడంతో ధరల పెరుగుదల



మదనపల్లె మార్కెట్‌కు రైతులు తీసుకువచ్చిన టమాటా

మదనపల్లె : దేశంలోనే అతిపెద్ద టమాటా మార్కెట్‌గా గుర్తింపుపొందిన మదనపల్లెలో మంగళవారం మొదటిరకం టమాటా ధర కిలో రూ.34 వరకు పలికింది. గత ఏడాది అక్టోబర్‌లో మొదటి రకం కిలో టమాటా రూ.44–36 మధ్య ధర పలికితే, సరిగ్గా ఆరునెలల తర్వాత మొదటిసారిగా కిలో రూ.34 ధర నమోదైంది. ఈ ఏడాది మదనపల్లె మార్కెట్‌లో టమాటా సీజన్ ప్రారంభమయ్యాక ఇదే అత్యధిక ధరగా నమోదైంది. నాలుగురోజులుగా మదనపల్లె మార్కెట్‌లో టమాటా ధరలను పరిశీలిస్తే..శనివారం మొదటిరకం టమాటా కిలో రూ.14, ఆదివారం కిలో రూ.16, సోమవారం కిలో రూ.24, మంగళవారానికి కిలో రూ.34 అంటే కేవలం మూడ్రోజుల వ్యవధిలో కిలోకు రూ.20కు పైగా ధర పెరిగింది. మదనపల్లె మార్కెట్‌లో టమాటాలు కొనుగోలు చేసేందుకు ఛత్తీస్‌గఢ్, వెస్ట్‌బెంగాల్, ఒరిస్సా, తమిళనాడుకు చెందిన వ్యాపారులు రావడంతో పోటీ పెరిగి అధిక ధరలు పలికినట్లు మార్కెట్‌కమిటీ అధికారులు తెలిపారు. దీనికితోడు వాతావరణ పరిస్థితుల కారణంగా మార్కెట్‌కు వస్తున్న దిగుబడులు తక్కువ కావడం, ఇక్కడి నుంచి టమాటా ఎగుమతి అయ్యే ప్రాంతాల్లో స్థానికంగా లభ్యత తగ్గిపోవడంతో బయటిప్రాంతాల్లో డిమాండ్‌తో ధర రోజురోజుకీ పెరుగుతున్నట్లు వ్యాపారులు తెలిపారు. మండిపోతున్న ఎండలతో గతంలో 8 కోతలు వచ్చే టమాటా పంట ప్రస్తుతం 3–4 కోతలకు పరిమితం అవుతుండటం, దిగుబడులు తగ్గిపోతుండటం టమాటా ధర పెరుగుదలకు ప్రధాన కారణంగా రైతులు పేర్కొంటున్నారు. మంగళవారం మదనపల్లె మార్కెట్‌లో మొదటిరకం టమాటా కిలో రూ.24–32 వరకు, రెండోరకం టమాటా కిలో రూ.14–23.80 వరకు ధర పలికింది. రెండేళ్లుగా టమాటా పంటలో నష్టాలను చవిచూసిన రైతులు ప్రస్తుతం పెరుగుతున్న ధరలపై గంపెడాశతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

హంద్రీనీవా కాలువకు నీటిని విడుదల చేయాలి



డీఏఓ శేషయ్యకు వినతిపత్రం అందిస్తున్న రైతుకూలీసంఘం నాయకులు

మదనపల్లె : వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు హంద్రీనీవా కాలువలో నీటిప్రవాహానికి అడ్డంకులను తొలగించి, యుద్ధప్రాతిపదికన మరమ్మతులు పూర్తి చేసి నీటిని విడుదల చేయాలని అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోరెడ్డి రమణారెడ్డి కోరారు. మంగళవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో డీఏఓ శేషయ్యను కలిసి హంద్రీనీవా కాలువకు నీటివిడుదలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ.. రాయలసీమ ప్రాంతానికి అదనంగా సాగు,తాగునీరు ఇచ్చేందుకు శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి వందరోజుల్లో ప్రస్తుతం ఉన్న 44వేల క్యూసెక్కులకు తోడుగా మరో 44వేల క్యూసెక్కుల నీటిని తరలించాలనే లక్ష్యంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. హంద్రీనీవా కాలువకు నీటిని విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవడంతో పాటు వ్యవసాయరంగానికి అండగా నిలిచేందుకు అఖిల భారత రైతు కూలీసంఘం పనిచేస్తుందన్నారు. ఇందులోభాగంగా మండలాల వారీగా రైతులను, ప్రజానీకాన్ని జాగృతం చేసేలా హంద్రీనీవా కాలువ వెంబడి పాదయాత్ర నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆంజనేయులు, సురేంద్ర పాల్గొన్నారు.

దళిత వాడల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న తహసీల్దార్ ధనుంజయలు

పీలేరు రూరల్ : మండలంలోని దళితవాడల అభివృద్ధికి కృషి చేస్తామని తహసీల్దార్ కె. ధనుంజయలు అన్నారు. మంగళవారం పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని గూడరేవుపల్లెలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత గ్రామాల్లో ఏవైనా సమస్యలుంటే మా దృష్టికి తీసుకొస్తే సమస్యలు సత్వరమే పరిష్కరిస్తామని తెలిపారు. సమావేశంలో దళిత నాయకులు గట్టప్ప మాట్లాడుతూ గూడరేవుపల్లెలోని దళితవాడలకు స్మశాన స్థలం కేటాయించాలని కోరారు. ఏడో విడత భూ పంపిణీలో ఐదు మందికి పట్టాలు ఇచ్చారని, అయితే ఇంత వరకు భూమి చూపించలేదన్నారు.తక్షణమే భూమి చూపించాలని డిమాండ్ చేశారు. ఉపాధిలో జాబ్‌కార్డు కల్గిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని కోరారు. అన్ని సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ మురళీమోహన్‌రెడ్డి, ఏపీఎం లక్ష్మణ్‌రెడ్డి, ఏపీవో చెన్నకేశవులు, ఇరిగేషన్ ఏఈ ఎత్తిరాజులు, ఏవో రమాదేవి, ఏఎస్ఐ హేమసుందరం తదితరులు పాల్గొన్నారు.

ప్రతి వ్యక్తికి ఆరోగ్య గుర్తింపు కార్డు

కలకడ : జిల్లాలోని ప్రతి వ్యక్తికి ఆరోగ్య గుర్తింపు కార్డు (ఎన్‌సీడీసీపీఓ) ఆధార్‌కార్డు లాగా కలిగి ఉండాలి. అందుకు నమోదు చేయడం ఆరోగ్యసిబ్బంది బాధ్యతగా తీసుకుని వందశాతం పూర్తి చేయాలని జిల్లా ఎన్‌సీడీసీపీఓ డాక్టర్ శేషగిరిబాబు ఆదేశించారు. మంగళవారం కలకడ పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన ఏఎన్‌యంలు, ఆశావర్కర్లు, ఆరోగ్యసిబ్బంది సమావేశంలో పాల్గొని నమోదు పరిశీలించారు. దేశంలో ఎక్కడ తనిఖీ చేసినా గుర్తింపు నెంబర్ ప్రకారం వ్యక్తి ఆరోగ్యం ఆన్‌లైన్‌లో తెలుసుకోవచ్చునని గుర్తు చేశారు. కలకడ పీహెచ్‌సీ పరిధిలో 74 శాతం నమోదు పూర్తి చేశారని మిగిలిన వ్యక్తుల సమాచారం పూర్తిగా తెలుసుకుని వందశాతం పూర్తి చేయాలన్నారు. ప్రతి పంచాయతీలోని అందరూ వ్యక్తుల సమాచారం సచివాలయం పరిధిలో అంతుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యపై ఆహారభద్రతవలె –ఆరోగ్యభద్రత కల్పిస్తుందన్నారు. అనంతరం పీహెచ్‌సీ రికార్డులు తనిఖీ చేశారు. డాక్టర్ మల్లికార్జున, మోహన్, ఎంపీహెచ్‌ఈఓ వెంకటేశు, సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పశు విజ్ఞానబడిని సద్వినియోగం చేసుకోవాలి

పీలేరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పశువిజ్ఞానబడిని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీలేరు మండల పశువైద్యాధికారి ప్రదీప్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వేపులబైలు పంచాయతీ రెడ్డివారిపల్లెలో పశువిజ్ఞానబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆర్బీకే పరిధిలోని పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించేందుకు పదిహేనురోజులకోసారి ప్రత్యేకంగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. పాడి రైతుల పశుపోషణకోసం మొక్కజొన్న విత్తనాలు 8600 కేజీలు, జొన్న 6700 కేజీలు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. ప్రభుత్వ రాయితీతో ఇచ్చే విత్తనాలు పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యుడు బోదేషావలి, మండల వ్యవసాయ సలహామండలి సభ్యులు రత్నశేఖర్‌రెడ్డి, వీఏఏ హేమంత్ పాల్గొన్నారు.

నవశకానికి నాలుగేళ్లు



పెద్దతిప్పసముద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకుల సంబరాలు



కురబలకోటలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెద్దతిప్పసముద్రం: రాష్ట్రంలో చంద్ర గ్రహణం తొలగి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుభిక్ష పాలన అందిస్తూ నవశకానికి నాంది పలికి నాలుగేళ్లు పూర్తయింది. దీంతో మంగళవారం మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు సంఘీభావం తెలుపుతూ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్ర అభివృద్ధిలో గత చరిత్రలను తిరగ రాసి గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని ఏర్పాటు చేసి కొత్త చరిత్రకు నాంది పలికిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు మహమూద్, శివన్న,డ్రిప్ రమణ, నారాయణరెడ్డి, భాస్కర్ నాయుడు, సుబ్బిరెడ్డి, తమక శంకర్,చంద్రశేఖర్, మంజునాథ్, కేశవ్, కిట్టన్న, ఖాదర్‌వలి, ఆసిఫ్ బాషా, మహబూబ్‌బాషా, సాదిక్, సికిందర్, హరి, విశ్వనాథ్‌రెడ్డి, రవి, మేకల చంద్ర, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

కురబలకోట: దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం జగన్ పాలన అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి బైసాని చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ బి. దస్తగిరి అన్నారు. సీఎం జగన్ నాలుగేళ్ల పాలన సందర్భంగా మంగళవారం కురబలకోటలో కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. వారు మాట్లాడుతూ సీఎం జగన్ ప్రతి గడపకు సంక్షేమ పథకాలను అందించారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుట్రలు పన్నినా తిరిగి సీఎంగా జగనే అవుతారన్నారు.

ఘనంగా గంగజాతర

రామసముద్రం: మండలంలోని ఊలపాడు పంచాయతీ నరసాపురంలో వెలసిన గంగమ్మజాతర మంగళవారం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం గ్రామానికి చెందిన గ్రామదేవతలకు మహిళలు ఉపవాస దీక్షలతో దీపాలు మోసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గ్రామం నడిబొడ్డున వెలసిన గంగమ్మకు పూజలు నిర్వహించి చక్కభజనలు, కోలాటలతో గ్రామంలో ఊరేగించారు. ఉదయం అమ్మవారికి జంతుబలి చేసేందుకు గేదేపోతులను పూజించారు. బంధుమిత్రులతో గ్రామం కలకళలాడింది. అమ్మవారి ఊరేగింపులో ఇంటింటా మహిళలు కర్పూరహారతులు అందజేశారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

పీలేరు : పీలేరు గ్రామపంచాయతీ పరిధిలో మొక్కలు నాటి సంరక్షించాలని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరులో పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో త్వరలో పది వేల మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. వలంటీర్లు ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేసి వాటిని సంరక్షించే విధంగా ప్రజల్లో చైతన్యం నింపాలన్నారు. సమావేశంలో ఈవో ప్రసాద్‌రెడ్డి, శ్యానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులకు ప్రాధాన్యత

కేవీపల్లె : జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర హౌసింగ్ శాఖ మంత్రి జోగి రమేష్‌ను రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కారపాకుల భాస్కర్‌నాయుడు కోరారు. మంగళవారం తిరుపతికి విచ్చేసిన మంత్రి తోపాటు స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌జైన్, హౌసింగ్ ఎండీ లక్ష్మీషాలను కలసి హౌసింగ్‌లోని సమస్యలు వివరించారు. ఇళ్ల నిర్మాణం వేగవంతం కావడానికి, వసతుల కల్పనకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

డీఎల్‌పీఓ తనిఖీ

పెద్దమండ్యం: డీఎల్‌పీఓ జయకుమారి మంగళవారం వెలిగల్లు సచివాలయాన్ని సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ఏడబ్ల్యూపీసీ షెడ్‌ను చూశారు. దీనిని సక్రమంగా నిర్వహించి సిబ్బందికి వెంటనే వేతనాలు ఇవ్వాలన్నారు. ఎంపీడీఓ శ్రీధర్ రావు, ఈఓఆర్‌డి జనార్దన్, సర్పంచ్ మొలక బయ్యారెడ్డి, సి. సరస్వతి, కార్యదర్శి శైలజ పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన

తంబళ్లపల్లె: భారత రాజ్యాంగం కల్పించిన పౌరహక్కులపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని తహసీల్దార్ భీమేశ్వరరావు అన్నారు. మంగళవారం తూర్పుహరిజనవాడలో పౌరహక్కుల దినం నిర్వహించారు. పౌర హక్కుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రెడ్డప్పనాయక్ ,ఆర్ఐ రవి, ఐసీడీఎస్ శ్వేత, రవి తదితరులు పాల్గొన్నారు.

గాలి వాన బీభత్సం

కలికిరి: మండల పరిధిలోని మంగళవారం మధ్యాహ్నం గాలీవాన బీభత్సం సృష్టించింది. పెనుగాలులతో కూడిన వర్షం కురిసింది. గాలుల ధాటికి కలికిరి పట్టణ పరిధిలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోక పోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. పట్టణంలో మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 4.30గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ట్రాన్స్‌కో సిబ్బంది యుద్ధప్రాతిపదికన శ్రమించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

అంటరానితనం నిర్మూలనపై అవగాహన

పెద్దతిప్పసముద్రం: అంటరానితనం నేరం.. వాటిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ విద్యాసాగర్ సూచించారు. పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని టి.సదుం దళిత కాలనీలో అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. దళితుల హక్కులు, చట్టాలను వివరించారు. సర్పంచ్ శారద, ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి, ఏఈలు ఉత్తన్న, శ్రీనివాసులు, నిరంజన్‌రెడ్డి, కందుకూరు పీహెచ్‌సీ డాక్టర్ శంకర్, ఆర్ఐ అనీషా, వీఆర్వో వరదరాజులు, కార్యదర్శి సురేంద్రబాబుతో పాటు దళిత నాయకులు కదిరప్ప, రామప్ప, రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్

వాల్మీకిపురం: స్పందనలో వచ్చే ఫిర్యాదులను జాగ్రత్తగా పరిష్కరించాలని ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లుకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం, 1902 కార్యక్రమం ద్వారా ఫిర్యాదు చేసే వ్యక్తికి సమస్య పరిష్కారం నిమిత్తం మన బాధ్యతను రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగే స్పందన కార్యక్రమం, ప్రతి రోజు సచివాలయంలో మూడు గంటల నుంచి ఐదు గంటల లోపు వచ్చే ఫిర్యాదులను జాగ్రత్తగా పరిష్కరించాలన్నారు. పరిష్కరించే సమస్యలు కొన్ని సమస్యలు ప్రత్యక్షంగా పరిష్కరించేవి, కొన్ని సమస్యలను ఏపీ ఈసేవ ద్వారా, కొన్ని సమస్యలను ప్రభుత్వ నిర్ణయాల ద్వారా, మరికొన్ని సమస్యలను కోర్టు సివిల్ లావాదేవీల ద్వారా తిరస్కరించబడితే ఎందువల్ల ఆ సమస్యలు తిరస్కరించబడ్డాయో ఫిర్యాదుదారుడికి గుణాత్మకంగా తెలియజేయాల్సి ఉంటుందన్నారు. అలాగే ఇక నుంచి ప్రతి ఫిర్యాదుదారుడికి రాతమూలకంగా తమ సమస్యను ఏ విధంగా పరిష్కరించగలరు అన్న విషయాలను తెలపవలసి ఉంటుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫిరోజ్ ఖాన్, హౌసింగ్ ఏఈ సుబ్బారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మిథున్ చక్రవర్తి, ట్రాన్స్‌కో ఏఈ జాకీర్ హుస్సేన్, పిఆర్ ఏఈ కమలాకర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా బ్రహ్మోత్సవాలు



రామాలయంలో చర్చిస్తున్న ఎమ్మెల్యే చింతల, టీటీడీ అధికారులు, ఉభయదారులు

వాల్మీకిపురం: టీటీడీ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది నిర్వహిస్తున్న వాల్మీకిపురంలోని పట్టాభిరాముడి వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా జరుపుకోవాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పట్టాభిరామాలయంలో ఆలయ సేవల నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా డీజేలను రద్దు చేయాలని, దీని వలన భక్తి భావం పూర్తిగా దెబ్బతింటోందని ప్రజలు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎమ్మెల్యే వాహన సేవల్లో ఆధ్యాత్మిక భావన, సాంస్కృతిక కార్యక్రమాలు తప్పితే ఎటువంటి డీజేలు, సినిమా పాటలు పెట్టొదని, వీటిని పూర్తిగా నిలిపివేస్తున్నామన్నారు. అలా కాదని ఉభయదారులు ఎవ్వరూ డీజేలు పెట్టొదని స్పష్టం చేశారు. అనంతరం టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి రాబోవు ఏడాదిలో వాహన సేవలు పూర్తిస్థాయిలో ఉభయదారుల ఆధ్వర్యంలోనే నిర్వహిస్తామన్నారు. ఇందుకు అయ్యే ఖర్చును ఉభయదారులే భరించాల్సి ఉంటుందన్నారు. ఇందులో ఒత్తిడి ఏమీ లేదన్నారు. ఉభయదారులు ముందుకు రాని సమయంలో టీటీడీనే నిర్వహిస్తుందన్నారు. అలాగే ఆలయంలో నిర్వహించే ఆర్జిత సేవలు, కళ్యాణోత్సవ సేవలు, ఊంజల్ సేవ తదితర వాటిలో భక్తుల భాగస్వామ్యంపై ప్రజల నిర్ణయాన్ని టీటీడీ తెలుసుకుంది. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, గ్రామ పెద్దలు చింతల ఆనంద రెడ్డి, ఉపసర్పంచ్ కేశవ రెడ్డి, క్రిష్ణమూర్తి, నీళ్లభాస్కర్, బలరాం, శంకర, సతీష్, ఉభయదారులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తాం



అభివృద్ధి పనులు పర్యవేక్షిస్తున్న నారదరెడ్డి

కలకడ: ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర రెడ్డిసంఘం గౌరవాధ్యక్షుడు వరదారెడ్డి నారదరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తెట్టులో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయానికి ఆయన రూ. 2లక్షలు విలువచేసే గ్రానైట్, ఇతర వస్తువులు విరళాం ఇచ్చారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తామన్నారు. ఈనెల 31 ధ్వజస్తంభ స్థాపన, జూన్ 1తేదిన స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఇక్కడ జరుగుతాయన్నారు. ఇంకా ఆలయ అభివృద్ధికి అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు కిల్లా నాగరాజ, సరస్వతి, రెడ్డిశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల సాధనకు రిలే దీక్ష



రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఏపీజీఈఏ సంఘం ఉద్యోగులు

వాల్మీకిపురం: ప్రతి నెలా ఒకటో తేదిన ప్రభుత్వ ఉద్యోగులకు జీతభత్యాలు చెల్లించేలా చట్టం చేయాలని ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి డిమాండ్ చేశారు. ఏపీ ప్రభుత్వం ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టం ఆమోదించని సీపీఎస్‌ను రద్దు పరిచి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. రాష్ట్ర కార్యవర్గం ఇచ్చిన పిలుపుమేరకు రాష్ట్రంలో గల ప్రతి జిల్లాలో ప్రతి తాలూకా కేంద్రంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగులు, ఉద్యోగ ఉపాధ్యాయ, కాంట్రాక్టు, కార్మిక, పెన్షనర్ల, సీపీఎస్ ఉద్యోగులు, గ్రామ వార్డు సచివాలయం అన్ని సంఘాల మద్దతుతో ఉద్యోగులు అందరూ కలసి రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నారని, ఉద్యోగులకు రావలసిన ఆర్థిక బకాయిలు, అనేక సమస్యలు, సీపీఎస్ రద్దు తదితర సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఏపీజీఈఏ సిబ్బంది సుధాకర్, రెడ్డి నాయక్, రమణ, గురుప్రసాద్, శివరాం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి



సచివాలయ మహిళా పోలీసులకు సూచనలిస్తున్న సీఐ సత్యనారాయణ

మదనపల్లె : గ్రామ సచివాలయాల్లోని మహిళా పోలీసులు సమర్థవంతంగా విధులు నిర్వహించి శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం సీఐ కార్యాలయంలో సచివాలయ మహిళా పోలీసులతో సమావేశం ఏర్పాటుచేశారు. వేసవిసెలవుల నేపథ్యంలో బయటి ఊర్లకు వెళ్లే వ్యక్తులు తమ ఇంటిలోని విలువైన వస్తువులను జాగ్రత్త పరచుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఇంటికి తాళం వేసి వెళ్లేవారు డయల్ 100కి ఫోన్‌చేసి చెపితే వారి నివాసస్థలంలో పోలీసులు నిఘా పెట్టడం జరుగుతుందన్నారు. సచివాలయ మహిళా పోలీసులు ప్రజలతో మమేకమై వారి నమ్మకాన్ని చూరగొనాలన్నారు. అప్పుడే సమాజంలోని అనేకవిషయాలపై, ఇతర ఘటనలపై సమాచారం అందుతుందన్నారు. ప్రతి మహిళా పోలీసు వలంటీర్ల సహాయంతో వారి వారి పరిధిలో లాక్ హౌస్ లిస్టును సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో అందజేయాలన్నారు. సీటీఎం, పోతపోలు గ్రామాల్లో సారా విక్రయాలు అధికంగా జరుగుతున్నట్లు సమాచారం వచ్చిన నేపథ్యంలో అమ్మకందారులు, తయారీదారులు, రవాణాదారులకు సంబంధించి నిఘా ఉంచాలన్నారు. అనుమానిత వ్యక్తులపై సమాచారం అందిస్తే దాడులు చేసి సారా విక్రయాలు అరికట్టే వీలుంటుందన్నారు.